కర్ణాటకలో 'వైద్య' సంక్షోభం!

- విష జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- దవాఖానల్లో సరిపడా లేని మందులు
- రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మంది డాక్టర్ల కొరత
- సీఎం కుర్చీలాటలో బిజీగా కాంగ్రెస్ ప్రభుత్వం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): విష జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. రోగులకు వైద్యం చేయడానికి సరిపడా డాక్టర్లు లేరు. మందులు అసలే లేవు. ఇదీ కాంగ్రెస్ ఏలుబడిలో కర్ణాటకలో కనిపిస్తున్న ప్రస్తుత పరిస్థితి. అయితే, ప్రజారోగ్యాన్ని పట్టించుకోని సిద్ధరామయ్య ప్రభుత్వం.. వరుస స్కాంలు, రాజకీయాలతో బిజీగా ఉండటం సర్వత్రా విమర్శలకు దారితీస్తున్నది.

మందులు లేవు.. డాక్టర్లు అసలే లేరు

ఇటీవల కురిసిన వర్షాలతో రాష్ట్రంలోని పలు గ్రామాలు, ఏజెన్సీల్లో డెంగ్యూ, చికెన్‌గున్యా, టీబీ వంటి విష జ్వరాలు పెద్దయెత్తున ప్రబలాయి. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, జిల్లా దవాఖానలకు వేలాది మంది రోగులు క్యూగట్టారు. అయితే, ప్రభుత్వ దవాఖానల్లో తగినంత ఆరోగ్య సిబ్బంది, డాక్టర్లు లేకపోవడంతో వైద్య సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయే దుస్థితి వాటిల్లింది. రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో 1,940 డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు హెల్త్ కమిషనర్ శివకుమార్ కేబీ స్వయంగా వెల్లడించారు. ఇక, ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో పారాసిటమాల్ వంటి మందు గోలీలు కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఇది ఇలాగే కొనసాగితే, రాష్ట్రంలో ఆరోగ్య సంక్షోభం నెలకొనవచ్చని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రభుత్వ దవాఖానలకు సరఫరా చేయాల్సిన అత్యవసర మందుల్లో 190 రకాల మందులు అందుబాటులో లేవని ఆరోగ్యమంత్రి దినేశ్ గుండురావు ఇటీవల పేర్కొనడం ప్రస్తుత దుస్థితికి అద్దంపడుతున్నది.

ప్రభుత్వ దవాఖానల్లో వైద్యుల పోస్టులు ఖాళీ ఇలా..	
స్పెషలిస్టులు	744
జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు	613
మెడికల్ ప్రొఫెషనల్స్	558
డెంటల్ డాక్టర్లు	25

రాజకీయాలతో బిజీబిజీ

ప్రజలు విషజ్వరాలతో ఒకవైపు అల్లాడిపోతుంటే సీఎం సిద్ధరామయ్య తన పదవిని కాపాడుకోవడంలో బిజీగా ఉన్నారని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ముడా, వాల్మీకి స్కాం ఆరోపణలతో సిద్ధరామయ్య సీఎం పదవి నుంచి దిగిపోతే, ఆ పోస్టును దక్కించుకోవడంలో ఇతర మంత్రులు బిజీగా ఉన్నట్టు ఎద్దేవా చేస్తున్నాయి. కాగా, విష జ్వరాలకు సంబంధించి గ్రామాల్లో కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయని, అయితే, అక్కడి ఆరోగ్య కేంద్రాల్లో తగినంత మంది సిబ్బంది, మందులు, సదుపాయాలు లేకపోవడంతో తాము ఏమీ చేయలేని దుస్థితి వాటిల్లిందని బెంగళూరు మెడికల్ కాలేజీ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఓ సీనియర్ డాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు.

సత్తా ఉన్నా.. సీఎం పోస్టు ఇవ్వరా?

- నాలాంటి దళితులకు ముఖ్యమంత్రి పీఠం అందని ద్రాక్షగానే ఉంటుందా?
- అధిష్ఠానంపై అసహనం వ్యక్తం చేసిన కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కర్ణాటక కాంగ్రెస్‌లో కుర్చీలాట రసకందాయంలో పడింది. సీఎం పీఠంపై తమకున్న ఆసక్తిని సీనియర్ నేతలు బహిరంగంగానే చెప్తున్నారు. ముఖ్యమంత్రి పదవికి తాను ఏ విధంగా అర్హుడిని కాదో చెప్పాలంటూ హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర ఏకంగా అధిష్ఠానాన్నే ప్రశ్నించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముడా, వాల్మీకి కుంభకోణాలతో పీకల్లోతు కష్టాల్లో చిక్కుకొన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఈ పరిణామం మింగుడు పడటం లేదు.

పరమేశ్వర ఏమన్నారంటే?

తుమకూరులో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన జీ పరమేశ్వర సీఎం పదవిపై తనకున్న ఆసక్తిని బయటపెట్టారు. ఆయన మాట్లాడుతూ.. 'బసవలింగప్ప, మల్లికార్జున స్వామి, కేహెచ్ రంగనాథ్, మల్లికార్జున ఖర్గే వంటి ఎందరో సీనియర్లు సీఎం పీఠానికి అర్హులు. ఆ మాటకొస్తే, నేను కూడా అర్హుడినే. అయితే, సీఎం పదవి మమ్మల్ని వరించదు. దళితులకు సీఎం పదవి అనేది అందని ద్రాక్షగానే ఉన్నది? సత్తా ఉన్నప్పటికీ నాలాంటి వారికి ముఖ్యమంత్రి పదవి ఎందుకు ఇవ్వరు? ఒకవిధంగా, ఆ బస్సును (పదవిని) మేం మిస్ అయ్యామనిపిస్తున్నది' అని పరమేశ్వర కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. దీంతో 'మీరు ఆ బస్సును ఇంకా మిస్ అవ్వలేదం'టూ కార్యకర్తలు సభలో నినాదాలు చేశారు.

కొనసాగుతున్న కుర్చీలాట

వరుస స్కాంలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు పదవీ గండం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన కుర్చీ దిగితే వెంటనే అందులో కూర్చునేందుకు కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వర, సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహోళి సీఎం పదవి కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకానొక సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరు కూడా చర్చకు వచ్చింది. అయితే, సిద్ధరామయ్య తర్వాత ఎవరిని ముఖ్యమంత్రిని చేయాలనే అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ సామాజికవర్గ సమీకరణాలను బేరీజు వేసుకుంటున్నట్టు తెలుస్తున్నది. బీసీ నాయకుడైన సిద్ధరామయ్యను తప్పిస్తే మరో బీసీ నేతకే అవకాశం ఇవ్వకపోతే బీసీలు దూరం అవుతారనే ఆందోళన హైకమాండ్‌కు ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే బీసీ నాయకుడైన జార్కిహోళి పేరును పరిశీలించవచ్చని తెలుస్తున్నది. ఈ క్రమంలోనే పరమేశ్వర పై వ్యాఖ్యలు చేసినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

'వాల్మీకి స్కామ్' పాత్రధారికి కీలక పదవి

కర్ణాటక సర్కారు నిర్ణయంపై సర్వత్రా విమర్శలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కర్ణాటకతో పాటు తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న 'వాల్మీకి కార్పొరేషన్' స్కామ్‌లో పాత్రధారిగా ఉండి, సస్పెన్షన్‌కు గురైన అధికారికి కర్ణాటక ప్రభుత్వం తిరిగి పోస్టింగ్ ఇచ్చింది. కార్పొరేషన్‌కు గతంలో డైరెక్టర్‌గా విధులు నిర్వహించి సస్పెన్షన్‌కు గురైన కల్లేశ్‌ను కర్ణాటక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (సీఏవో)గా నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. వాల్మీకి కార్పొరేషన్‌కు సంబంధించిన నిధుల వినియోగంపై వివరాలు ఇవ్వడంలో కల్లేశ్ ఉద్దేశపూర్వకంగా జాప్యం వహించాడన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు, ఈ స్కామ్‌లో ఆయన పాత్ర కూడా ఉన్నదని విపక్షాలు ఆరోపించాయి. దీంతో సర్వత్రా ఒత్తిళ్లు రావడంతో గత జూన్‌లో ఆయన్ని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అయితే, మూడు నెలలు గడవకముందే ప్రభుత్వం కల్లేశ్‌కు మళ్లీ కీలక పోస్టింగ్ ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చితకబాది.. నగ్నంగా పరుగెత్తించి

- బెంగళూరులో ఓ వ్యక్తిపై రౌడీషీటర్ అరాచకం
- సిద్ధరామయ్య సర్కారుపై ప్రతిపక్షాల తీవ్ర విమర్శలు



బెంగళూరు, సెప్టెంబర్ 16: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో శాంతిభద్రతల డొల్లతనాన్ని ఎత్తిచూపేలా ఓ షాకింగ్ ఘటన చోటు చేసుకున్నది. ఐటీ నగరం బెంగళూరులో ఓ రౌడీ షీటర్ రెచ్చిపోయాడు. ఓ వ్యక్తిని చితకబాదడమే కాకుండా నగ్నంగా వీధుల్లో పరుగెత్తించిన అమానుష ఘటన నగరంలోని కామాక్షిపాల్యలో జరిగింది. గుర్తు తెలియని ఆ వ్యక్తిని రౌడీషీటర్ దారుణంగా కొట్టాడు. బతికి ఉండాలంటే బట్టలిప్పేసి నగ్నంగా పరుగెత్తాలని ఆదేశించడంతో బాధిత వ్యక్తి అలా అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై పరుగులు తీశాడు. అందరూ అతడిని అలా చూస్తూ ఉండిపోయారే తప్ప అతడిని ఆదుకోవడానికి ఎవరూ ధైర్యంగా ముందుకు రాలేదు. దీనికి సంబంధించిన వీడియో సోమవారం వైరల్ కావడంతో బెంగళూరు పోలీసులు నిందితుడిని పవన్ గౌడగా గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. బట్టలిప్పి నగ్నంగా మారాలంటూ పవన్ అతడిని బెదిరించడం, తనపై దయ చూపాలంటూ బాధితుడు అతడిని వేడుకుంటున్న దృశ్యం ఈ వీడియోలో ఉంది. తొలుత బాధితుడు బట్టలు తీసివేసి, తర్వాత వాటిని ధరించాడు. అయితే అలా చేసినందుకు అతడిని ఆ రౌడీషీటర్ కొట్టడమే కాక, నగ్నంగానే ఉండాలని ఆదేశించాడు. ప్రాణాలతో ఉండాలంటే బట్టల్లేకుండా పరుగెత్తాలని బెదిరించడంతో బాధితుడు అలాగే చేయక తప్పలేదు. ఈ ఘటన 10 రోజుల క్రితం జరిగినట్టు తెలిసింది. ఈ అమానుష ఘటనతో కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో పౌరుల భద్రతపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. అయితే ఈ దాడికి కారణాలు తెలియరాలేదు.

ఢిల్లీలో ముందస్తు ఎన్నికలు లేనట్టే!

- మహారాష్ట్రతోపాటే ఎన్నికల నిర్వహణకు సుముఖంగా లేని ఈసీ
- కేంద్ర ఎన్నికల సంఘం వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఢిల్లీ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు నిర్వహించాలంటూ సీఎం కేజ్రీవాల్ చేసిన డిమాండ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం సుముఖంగా లేదని తెలిసింది. అధికార పార్టీ లేదా ఒక రాజకీయ పార్టీ ఆదేశాలతో ఎన్నికల షెడ్యూల్‌ను నిర్ణయించలేమని ఈసీ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో ఆప్ సర్కార్‌కు కావాల్సినంత సంఖ్యా బలముందని, అలాంటప్పుడు ముందస్తు ఎన్నికలు జరపాల్సిన అవసరమేముందని ఈసీ భావిస్తున్నది. మహారాష్ట్ర, జార్ఖండ్‌లతో కలిపి ఢిల్లీ ఎన్నికలు నిర్వహించాలనుకుంటే, అందుకు బలమైన కారణం ఈసీ చూపాల్సి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెప్పారు.

నేడు కేజ్రీవాల్ రాజీనామా

అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం ఢిల్లీ సీఎం పదవికి రాజీనామా చేయనున్నారు. ఆయన లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అపాయింట్‌మెంట్‌ను కోరగా మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు సమయం ఇచ్చారు. దీంతో కేజ్రీవాల్ ఎల్జీని కలిసి తన రాజీనామాను సమర్పించనున్నారు. ఆప్ ఎమ్మెల్యేలతో మంగళవారం సమావేశం కానున్నారు. ఈ సమావేశంలోనే కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే ఈ సమావేశంలో కాబోయే కొత్త ముఖ్యమంత్రి పేరుపై కూడా చర్చిస్తారు. కాగా, సోమవారం పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న కేజ్రీవాల్ కొత్త ముఖ్యమంత్రి అభ్యర్థి పేరుపై కొందరు నేతలతో ముఖాముఖీ సమావేశమయ్యారు.

ప్రణీత్

కెనడాలో నీట మునిగి హైదరాబాద్ విద్యార్థి మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 16: హైదరాబాదీ యువకుడొకరు కెనడాలో ప్రమాదవశాత్తు నీట మునిగి మరణించాడు. రంగారెడ్డి జిల్లా మీర్‌పేటకు చెందిన ప్రణీత్ ఇటీవల కెనడా యూనివర్సిటీలో మాస్టర్స్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణ చేస్తూ స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. శనివారం తన సోదరుడి పుట్టిన రోజు సందర్భంగా సోదరుడు, స్నేహితులతో కలిసి టొరంటో లేక్‌కు వెళ్లాడు. అయితే బోటింగ్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించాడు. అతని మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రవీణ్ స్నేహితుడు సోమవారం సమాచారం అందించాడు. కాగా, ఆస్ట్రేలియాలోని క్వీన్‌ల్యాండ్స్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో కూడా ఇద్దరు తెలుగు విద్యార్థులు ఇలాగే నీటిలో పడి మరణించారు.

చట్టాలు కాదు.. మన మైండ్‌సెట్ మారాలి

అప్పుడే మహిళల హక్కులకు రక్షణ: సీజేఐ

న్యూఢిల్లీ: దేశంలో బహిరంగ, ప్రైవేట్ ప్రదేశాలలో మహిళల హక్కుల పరిరక్షణకు చట్టపరమైన నిబంధనల కొరత ఏమీ లేనప్పటికీ, చట్టం ఒక్కటే న్యాయమైన వ్యవస్థను ఏర్పాటు చేయలేదని, సమాజం కూడా పితృస్వామ్య సామాజిక వైఖరిని విడనాడాల్సిన అవసరం ఉందని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. సోమవారం ఆయన ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన స్త్రీ శక్తి కార్యక్రమంలో ప్రసంగిస్తూ మంచి, కఠిన చట్టాలు మాత్రమే మహిళలకు పూర్తి ప్రయోజనాన్ని చేకూర్చలేవని, వీటన్నింటికీ అతీతంగా ముందు మన ఆలోచనా విధానంలో మార్పు రావాలని అన్నారు. మహిళల హక్కుల గురించి మాట్లాడటమంటే అది మహిళలకు సంబంధించినది కాదని అన్నారు. తాను అద్భుతమైన పాఠాలను, మహిళా సహచరుల నుంచి నేర్చుకున్నానని ఆయన చెప్పారు. ఉన్నతమైన సమాజం కావాలంటే మహిళలకు సమాన ప్రాతినిధ్యం కావాలని తాను నమ్ముతానని అన్నారు. తాము భారత రాజ్యాంగాన్ని ఆమోదించడానికి ముందే మహిళల జీవిత శాసనాన్ని స్త్రీవాది అయిన హన్సా మెహతా రూపొందించారని చంద్రచూడ్ అన్నారు.

రాహుల్ నాలుక కోస్తే రూ. 11 లక్షలు

శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్

ముంబై, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రిజర్వేషన్లను రద్దు చేస్తామని మాట్లాడిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నాలుక కోసిన వ్యక్తికి రూ.11 లక్షల బహుమతి ఇస్తానని మహారాష్ట్రలోని బుల్దానా శివసేన (షిండే వర్గం) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలతో రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరి బట్టబయలైందని మండిపడ్డారు. మహారాష్ట్రతో పాటు దేశవ్యాప్తంగా రిజర్వేషన్లపై ఆందోళనలు కొనసాగుతున్న తరుణంలో రాహుల్ ఈ విధంగా మాట్లాడడం ఎంత వరకు సబబు అని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వైఖరితో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ప్రచారం చేసి ఓట్లు దండుకున్న రాహుల్, ఇప్పుడు అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లను తొలగిస్తామని చెప్పడం సరికాదన్నారు.

'నమో భారత్' రైలు ప్రారంభం

అహ్మదాబాద్, సెప్టెంబర్ 16: 'వందే మెట్రో' రైళ్ల పేరును 'నమో భారత్ ర్యాపిడ్ రైల్'గా కేంద్ర ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు మొదటి రైలు ప్రారంభానికి ముందు నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు మెట్రో రైళ్లు నగరాల్లోనే నడిచేవి. నగరాల మధ్య మెట్రో రైళ్లు నడిపించాలనే ఆలోచనతో ఈ నూతన రైళ్లను రైల్వే శాఖ తీసుకువస్తున్నది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ - భుజ్ మధ్య నడిచే మొదటి 'నమో భారత్ ర్యాపిడ్ రైల్'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం అహ్మదాబాద్‌లో ప్రారంభించారు. నాగ్‌పూర్ - సికింద్రాబాద్ మధ్య వందేభారత్ రైలు సహా పలు ఇతర రైళ్లు, అభివృద్ధి పనులను సైతం ఆయన ప్రారంభించారు.

మలప్పురంలో మాస్క్ మస్ట్

తిరువనంతపురం, సెప్టెంబర్ 16: నిఫా వైరస్‌తో 23 ఏండ్ల వ్యక్తి మరణించటంతో, కేరళలోని మలప్పురం జిల్లాలో తీవ్ర భయాందోళన నెలకొన్నది. వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో స్కూల్స్, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సినిమా థియేటర్లను ప్రభుత్వం మూసేయించింది. ప్రస్తుతం జిల్లాలో ముగ్గురు వ్యక్తులు నిఫా వైరస్ లక్షణాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నారు. దీంతో పలు వార్డులను కంటైన్‌మెంట్ జోన్లుగా ప్రకటించారు. ఇక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అందరూ మాస్కులు తప్పనిసరిగా ధరించాలని, జనం ఎక్కడా గుమికూడరాదంటూ జిల్లా కలెక్టర్ వీఆర్ వినోద్ నిషేధాజ్ఞలు జారీచేశారు. వైరస్ వ్యాప్తికి సంబంధించి కాంటాక్ట్ ట్రేసింగ్, పర్యవేక్షణ, ఫీవర్ సర్వే కోసం ఆరోగ్య శాఖ 16 కమిటీలను ఏర్పాటుచేసింది. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా సోమవారం తలపెట్టిన ఊరేగింపును రద్దు చేసుకోవాల్సిందిగా మలప్పురం జిల్లా కలెక్టర్ మసీదు కమిటీలను కోరారు. దుకాణాలు, షాపింగ్ మాల్స్ ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంచుతున్నారు.

జమిలి సాధ్యం కాదు

- ప్రస్తుత రాజ్యాంగం అందుకు అనుమతించదు
- అలా చేయాలంటే ఐదు సవరణలు చేయాలి
- కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం వెల్లడి

ఛత్తీస్‌గఢ్, సెప్టెంబర్ 16: బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్ (ఒకే దేశం.. ఒకే ఎన్నిక)'పై కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం ఘాటుగా స్పందించారు. ప్రస్తుత రాజ్యాంగం ప్రకారం ఇది ఎంతమాత్రమూ సాధ్యం కాదని, అలా చేయాలంటే రాజ్యాంగంలో కనీసం ఐదు సవరణలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్డీయే హయాంలోనే జమిలి అమలుపై చిదంబరం స్పందిస్తూ.. రాజ్యాంగ సవరణలు చేసేందుకు ప్రధాని మోదీకి ఇటు లోక్‌సభలో కానీ, అటు రాజ్యసభలో కానీ సరిపడా బలం లేదని పేర్కొన్నారు. ఇండియా కూటమి దీనికి వ్యతిరేకమని తేల్చిచెప్పారు.

జమిలి ఎన్నికలు కేంద్రం గారడీ: టీఎంసీ

జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఇచ్చిన సమాచారంపై టీఎంసీ, సీపీఐ ఘాటుగా స్పందించాయి. టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యతిరేక బీజేపీ చేస్తున్న మరో జిమ్మిక్ 'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలు' అన్నారు. హర్యానా, జమ్ము కశ్మీరు శాసన సభల ఎన్నికలతోపాటు మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలను కూడా ఎందుకు ప్రకటించ లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో లడకీ బహిన్ పథకాన్ని ప్రకటించిందని, మొదటి విడత సొమ్ము మహిళల బ్యాంకు ఖాతాలకు ఆగస్టులో చేరిందని చెప్పారు. రెండో విడత నిధులు లబ్ధిదారులకు అక్టోబరులో చేరే అవకాశం ఉందన్నారు. అందుకే మహారాష్ట్ర ఎన్నికలను ప్రకటించలేదని చెప్పారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా మాట్లాడుతూ, జమిలి ఎన్నికలను తమ పార్టీ సమర్థించదని చెప్పారు. భారత దేశం వైవిధ్య భరితమైన దేశమని, లోక్‌సభ, శాసన సభల పదవీ కాలాలు, ఎన్నికైన ముఖ్యమంత్రులు, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాల గురించి రాజ్యాంగం స్పష్టంగా చెప్పిందన్నారు. ఎన్డీయే ప్రస్తుత పదవీ కాలంలోనే జమిలి ఎన్నికలనుఅమలు చేయబోతున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపిన సంగతి తెలిసిందే.

ఒకే యాప్‌లో అన్ని రైల్వే సేవలు

- త్వరలో 'సూపర్ యాప్'
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: రైల్వేకు సంబంధించిన సేవలన్నీ ఒకే యాప్ ద్వారా అందుబాటులోకి తెస్తామని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం ప్రకటించారు. ఈ దిశగా తమ ప్రభుత్వం సూపర్ యాప్ తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం రైల్వే సేవలు అందించే యాప్‌లపై ప్రయాణికుల్లో గందరగోళం ఉన్నది. రకరకాల యాప్‌లు ఉన్నాయి. వీటిల్లో కొన్ని ప్రైవేటువి కూడా ఉన్నాయి. దీంతో ఏ సేవల కోసం ఏ యాప్ వాడాలో అర్థం కాని పరిస్థితి ఉంది. కాగా, గత ఏడాది దేశంలో 5,300 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ వేశామని, ఇది స్విట్జర్లాండ్ మొత్తం రైల్వే వ్యవస్థతో సమానమని మంత్రితెలిపారు. పదేండ్ల క్రితం ఏడాదికి సగటున 171 రైలు ప్రమాదాలు జరిగేవని, ఇప్పుడు 40కి తగ్గాయని ఆయన పేర్కొన్నారు.

ట్రంప్‌పై హత్యాయత్నం

- గోల్ఫ్ ఆడుతుండగా కాల్పులకు దుండగుడు యత్నం
- సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ల కాల్పులతో పరారీ
- వెంబడించి పట్టుకున్న భద్రతా సిబ్బంది

వాషింగ్టన్, సెప్టెంబర్ 16: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం జరిగింది. ఆయన గోల్ఫ్ ఆడుతుండగా ఓ దుండగుడు కాల్పులు జరిపేందుకు విఫలయత్నం చేశాడు. ఆదివారం ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్ వద్ద ఉన్న ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ కోర్టులో ఈ ఘటన చోటు చేసుకుంది. రక్షణ కంచె వద్ద నుంచి దుండగుడు ట్రంప్ లక్ష్యంగా ఏకే-47 తుపాకీ గురిపెట్టాడు. ఈ విషయాన్ని వెంటనే గుర్తించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు దుండగుడిపై కాల్పులు జరిపారు. దీంతో అతడు కారులో పారిపోగా, ఏజెంట్లు వెంబడించి అరెస్టు చేశారు. ట్రంప్‌పై హత్యాయత్నం జరగడం రెండు నెలల్లో ఇది రెండోసారి. జూలైలో పెన్సిల్వేనియాలోని బట్లర్ పట్టణంలో థామస్ మాథ్యూ క్రూక్స్ అనే యువకుడు ట్రంప్‌పై కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే.

నిందితుడు ట్రంప్ వ్యతిరేకి

ట్రంప్‌పై హత్యాయత్నానికి ప్రయత్నించిన నిందితుడిని హవాయ్‌కు చెందిన ర్యాన్ వెస్లీ రౌత్(58)గా భద్రతా సంస్థలు గుర్తించాయి. నార్త్ కరోలినాలో రౌత్‌కు పెద్ద నేరచరిత్ర ఉన్నట్టు ప్రాథమికంగా తేలింది. అతడు ట్రంప్ వ్యతిరేకి అని స్థానిక మీడియా పేర్కొన్నది.

నేను ఎప్పటికీ లొంగను: ట్రంప్

హత్యాయత్నం ఘటనపై ట్రంప్ స్పందించారు. 'నా సమీపంలో కాల్పులు జరిగాయి. నేను సురక్షితంగా ఉన్నా. నన్ను ఏదీ నిలువరించలేదు. నేను ఎప్పటికీ లొంగను' అని ఆయన పేర్కొన్నారు. తన ప్రాణాలు కాపాడిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ ఘటనను అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఖండించారు.

అంతరిక్ష ధూళితోనే జీవం ఆవిర్భావం!

శాస్త్రవేత్తల కొత్త సిద్ధాంతం

న్యూయార్క్: భూమిపై జీవం ఆవిర్భావానికి సంబంధించి శాస్త్రవేత్తలు కొత్త సిద్ధాంతాన్ని తెరపైకి తెచ్చారు. గ్రహశకలాలు ఒకదానితో ఒకటి ఢీకొట్టినప్పుడు ఏర్పడ్డ అంతరిక్ష ధూళి కారణంగానే భూమిపై జీవం ఉద్భవించిందని తెలిపారు. ఈ అధ్యయన వివరాలు 'నేచర్ ఆస్ట్రానమీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. భూమిపై జీవం ఎలా ఆవిర్భవించిందనే అంశంపై ఇప్పటివరకు అనేక సిద్ధాంతాలు తెరపైకి వచ్చాయి. 'ప్రీబయోటిక్ కెమిస్ట్రీ' ద్వారా ఏర్పడ్డ రసాయన సమ్మేళనాల ఫలితంగా జీవం మొదలయ్యిందనే సిద్ధాంతం ఇప్పటివరకు ప్రాచుర్యంలో ఉంది. అయితే, ఈ ప్రక్రియకు అవసరమైన భాస్వరం, సల్ఫర్, నత్రజని, కర్బనం వంటి మూలకాలు భూమిపై ఉన్న శిలల్లో ప్రతిక్రియాశీల, కరిగే రూపంలో సరిపడేంత లేవని ఈ అధ్యయనంలో శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కాబట్టి, 'ప్రీబయోటిక్ కెమిస్ట్రీ' పద్ధతిలో జీవం ఏర్పడి ఉండకపోవచ్చన్నారు.

విరామ సమయంలో శృంగారం

- లంచ్ బ్రేక్‌లు ఉపయోగించుకోండి
- పిల్లల్ని కనాలని రష్యా సూచన
- జననాల రేటు తగ్గడంపై ఆందోళన

మాస్కో: జననాల రేటు తగ్గిపోతుండటంపై రష్యా తీవ్ర ఆందోళన చెందుతున్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో జనాభా గణనీయంగా పడిపోతుందని భావిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రజలు పిల్లలను కనేలా ప్రోత్సహించేందుకు కొత్త ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ మేరకు ప్రజలకు ఆరోగ్య మంత్రి యెగ్వెని షెస్కోపలోవ్ పలు సూచనలు చేశారు. 'పనిలో తీరిక లేకుండా ఉన్నామని చెప్పడం సరైన కారణం కాదు. ఇలా చెప్పడం సాకు మాత్రమే. మీరు పనిలో ఉన్నప్పటికీ లంచ్, కాఫీ బ్రేక్‌లను పిల్లలను కనేందుకు ఉపయోగించుకోండి' ఆయన ప్రజలకు సూచించారు. రష్యా ప్రభుత్వం 18 నుంచి 40 ఏండ్ల మహిళలకు ఉచిత సంతాన సాఫల్య కేంద్రాలు సైతం నిర్వహిస్తున్నది.

6జీతో 30 నిమిషాల్లోనే ఫోన్ చార్జింగ్ డ్రెయిన్

- మరింత సమర్థ బ్యాటరీలు అవసరం
- అభిప్రాయపడుతున్న శాస్త్రవేత్తలు
- 2030లో 6జీ అందుబాటులోకి
- 5జీ కంటే 100 రెట్లు అధిక వేగం
- సెకనుకు 1 టెరాబైట్ల డాటా బదిలీ

లండన్, సెప్టెంబర్ 16: కమ్యూనికేషన్ల రంగంలో ఇప్పటికే ఎంతో పురోగతి సాధించిన ప్రపంచ దేశాలు తదుపరి తరం (6జీ) వైర్‌లెస్ కమ్యూనికేషన్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. కానీ, మనలో చాలా మంది మొబైల్ ఫోన్లలో ఎన్నటికీ ఈ టెక్నాలజీని ఉపయోగించలేకపోవచ్చని షెఫీల్డ్ యూనివర్సిటీకి చెందిన రేడియో ఇంజినీరింగ్ నిపుణుడు ఎడ్డీ బాల్ చెప్తున్నారు. 2030 నాటికి లేదా కాస్త అటు ఇటుగా 6జీ నెట్‌వర్క్ అందుబాటులోకి రావచ్చని, ఈ నూతన సాంకేతికతో డౌన్‌లోడ్ల వేగం విపరీతంగా పెరుగుతుందని పేర్కొన్నారు. సెకనుకు 1 టెరాబైట్ల డాటాను బదిలీ చేయగలిగే 6జీ నెట్‌వర్క్ ప్రస్తుతం అందుబాటులో ఉన్న 5జీ నెట్‌వర్క్ కంటే 100 రెట్లు వేగంగా పనిచేస్తుందని, 5జీ నెట్‌వర్క్ ద్వారా కొన్ని సెకన్లలో పూర్తయ్యే డౌన్‌లోడ్.. 6జీ నెట్‌వర్క్‌తో కేవలం మిల్లీసెకన్ల వ్యవధిలోనే పూర్తవుతుందని వివరించారు. కానీ, 6జీ నెట్‌వర్క్ చాలా శక్తిమంతమైనదని, దీన్ని వినియోగించేందుకు చాలా శక్తి అవసరమవుతుందని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చాలా మొబైల్ ఫోన్లు 6జీ నెట్‌వర్క్‌ను సపోర్ట్ చేయవని, కొన్ని మొబైల్ ఫోన్లు ఈ సాంకేతికతను సపోర్ట్ చేసినప్పటికీ వాటి బ్యాటరీలు కేవలం 30 నిమిషాల్లోనే డ్రెయిన్ అయిపోతాయని వివరించారు.

స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌తో చార్జింగ్

స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌తో బ్యాటరీ చార్జ్ అయ్యే సరికొత్త పద్ధతిని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. బిల్డింగులు, కార్లకు అమర్చే గ్లాస్‌ల ద్వారానూ చార్జింగ్ చేయొచ్చని దక్షిణ కొరియాకు చెందిన ఉస్లాన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు వివరించారు. 'పారదర్శకత కలిగిన సోలార్ సెల్‌ను గ్లాస్‌కు అమర్చి చార్జ్ చేయొచ్చు. ఈ సోలార్ సెల్‌కు రంగు ఉండదు. ఇది అత్యంత సామర్థ్యం కలిగినది' అని వెల్లడించారు. చార్జింగ్‌లో ఇది కీలక మార్పులు తెస్తుందన్నారు.

జీవం, మరణం లేని 'మూడో దశ'

- జీవి మరణించినా ప్రాణంతోనే కణాలు
- బయోలాజికల్ రోబోల్లో వినియోగం

న్యూఢిల్లీ: ఏ ప్రాణికి అయినా జీవం, మరణం అనే రెండు దశలే ఉంటాయనేది గతంలో ఉన్న అభిప్రాయం. అయితే, జీవి మరణించినా కొన్ని అవయవాలు మాత్రం పని చేస్తూనే ఉంటాయని అవయవ మార్పిడి ద్వారా నిరూపితమైంది. ఇప్పుడు పరిశోధకులు సరికొత్త విషయాన్ని గుర్తించారు. జీవి మరణించినా, దానిలోని కొన్ని కణాలు మాత్రం కొంతకాలం బతికే ఉంటాయని వెల్లడించారు. జీవం, మరణానికి ఇది భిన్నమైన మూడో దశ అని తెలిపారు. ఇందుకు సంబంధించి జరిపిన అధ్యయన వివరాలు 'ఫిజియాలజీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సింథటిక్ బయోలజీ రంగంలో సరికొత్త మార్పులు తెస్తున్న బయోలాజికల్ రోబోల్లో(బయోబోట్) ఈ కణాలను వినియోగించే అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు. అయితే, ముందుగా కణాలు ఎలా స్పందిస్తాయనేది గుర్తించడం శాస్త్రవేత్తలకు సవాల్‌గా ఉంటుందని అధ్యయనంలో పాల్గొన్న పీటర్ నోబెల్, అలెక్స్ పోజిటోక్ోవ్ తెలిపారు. జీవి మరణం తర్వాత కూడా ఈ కణాలు ఎలా జీవించగలుగుతున్నాయి అనేది శాస్త్రవేత్తలకు అర్థం కావడం లేదని వీరు పేర్కొన్నారు.